సాక్షి
బాపట్ల
మంగళవారం । 18 । జూన్ । 2024



## బంగారు పథకానికి విరాళం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కనకదుర్గమ్మ ఆలయం స్వర్ణ తాపడం పనుల నిమిత్తం సోమవారం యెగ్గిన లక్ష్మీకాంతారావు కుటుంబం రూ.1,11,116 విరాళం అందచేసింది.



## వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 20వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు.

## రాజరాజ నరేంద్రస్వామికి పూజలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో స్వయంభువుగా కొలువైన రాజరాజ నరేంద్ర స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### 26న ఐటీఐ కౌన్సెలింగ్

మాచర్ల: పల్నాడు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2024–25 సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థులందరూ బుధవారం ఉదయం 10 గంటలకు మాచర్ల పీడబ్ల్యూడీ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ సీహెచ్‌ఎస్‌పీ ప్రసాద్‌బాబు సోమవారం తెలిపారు. అభ్యర్థులందరూ ఒరిజినల్ సర్టిఫికెట్లు, 10వ తరగతి మార్కుల మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, ఈ–మెయిల్ ఐడీతో ఈనెల 26న హాజరుకావాలన్నారు. ప్రతి అభ్యర్థి దరఖాస్తులను వెరిఫికేషన్ చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు మాచర్ల ఐటీఐలో సంప్రదించాలని ప్రసాద్‌బాబు సూచించారు.

### రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం విశేష అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం 6 గంటలకు భజన చేశారు.

### దుర్గమ్మకు బంగారు నత్తు సమర్పణ






ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు భక్తులు సోమవారం బంగారు నత్తును కానుకగా సమర్పించారు. విజయవాడకు చెందిన పి.రాజ్‌కుమార్ కుటుంబం అమ్మవారి దర్శనానికి ఇంద్రకీలాద్రికి వచ్చింది. ఆలయ అధికారులను కలిసి రూ. 2 లక్షల విలువైన బంగారంతో తయారు చేయించిన 27 గ్రాముల నత్తును అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం తర్వాత ఆలయ ఏఈవో ఎన్.రమేష్ బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

### విద్యుత్ శాఖలో సమస్యలు పరిష్కరించండి

ఇబ్రహీంపట్నం: విద్యుత్ శాఖలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించి నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టాలని ఏపీ ఎస్‌ఈబీ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శివకుమార్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏవీ కిరణ్ కోరారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను సోమవారం చిలకలూరిపేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శివకుమార్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏ.వి. కిరణ్, సీపీడీసీఎల్ సెక్రటరీ జనరల్ ఎం. వసంతరావు, చంద్రశేఖర్ బెలగాల హుస్సేని, సుధాకర్, వెంకటేశ్వరరావు, జెన్కో ప్రెసిడెంట్ వై. కల్యాణ్ కుమార్, డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ నాయకులు సీహెచ్‌వీఎస్ నారాయణ, ఉమా విజయచంద్ పాల్గొన్నారు.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 812.80 అడుగుల వద్ద ఉంది.

### నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3800, గరిష్ట ధర రూ.5700, మోడల్ ధర రూ.4700 వరకు పలికింది.



రేపల్లె ఈద్గాలో ప్రత్యేక నమాజులో పాల్గొన్న ముస్లింలు

# త్యాగం ఉన్నత గుణం

- భక్తిశ్రద్ధలతో బక్రీద్
- ఈద్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

బాపట్ల: బక్రీద్ త్యాగానికి ప్రతీక అని, మానవత్వ లక్షణాలలో త్యాగం గొప్ప గుణం అని హఫీజ్ జనాబ్ సయ్యద్ షబ్బీర్ హుస్సేన్ సందేశం ఇచ్చారు. మహా ప్రవక్త ఇబ్రహీం అలైహిస్సలాం వారు దైవ సందేశాను సారం తమ ప్రియాతి ప్రియమైన పుత్రుడు ఇస్మాయిల్ జబీయుల్లాను భగవంతునికి సమర్పించడానికి సంసిద్ధులయ్యారని, వారి త్యాగనిరతికి ప్రతీకగా బక్రీద్ పండుగ జరుపుకుంటారని తెలియజేశారు. జమేదార్‌పేటలోని ఈద్గాలో హఫీజ్ సయ్యద్ షబ్బీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం షబ్బీర్ హుస్సేన్ సందేశాన్ని ప్రబోధించారు. ఖుర్బానీ ఇవ్వడం వల్ల పేదలు కూడా ఆనందంగా పండుగ జరుపుకుంటారని తెలిపారు. సాహితీవేత్త అబ్దుల్ ఖాదర్ జిలాని మాట్లాడుతూ భగవంతుని ఆజ్ఞను ప్రవక్త ఇబ్రహీం అలైహిస్సలాం శిరసా వహించారన్నారు. తండ్రి ఆజ్ఞ ప్రకారం తన్ను తాను భగవంతునికి సమర్పించుకోవడానికి ప్రవక్త ఇస్మాయిల్ జబీయుల్లా పూర్తి సంసిద్ధతను తెలియజేశారని గుర్తు



బాపట్లలోని జమేదార్‌పేట ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మత పెద్దలు

చేశారు. దేవుని పట్ల ఇటువంటి అచంచల విశ్వాసం, తండ్రి ఆజ్ఞను తూచా తప్పక పాటించే గొప్ప గుణం సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంజుమన్ ఎ ఇస్లామియా బాపట్ల ఉపాధ్యక్షులు బాజీ, ఖాదర్ వలి, బాషా, షేక్ ఇస్మాయిల్, జబీబుల్లా మస్తాన్‌వలి, మూసా, కలీముల్లా పాల్గొన్నారు.

# సేవలకు బంక్‌కొడితే అడగండి

- పెట్రోలు బంకుల్లో వసతులు ఉచితం
- మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం తప్పనిసరి
- జిల్లాలో 187 పెట్రోల్ బంక్‌లు



గుంటూరులోని ఓ పెట్రోల్ బంకు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఇప్పటికే పెట్రోలు, డీజిల్ ధరలు సెంచరీ దాటాయి. వీటి ధరలు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ సాగుతూ ఉంటుంది. ప్రతి లీటరుపై వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుంతో వినియోగదారులకు బంకుల్లో యజమానులు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. వీటి గురించి చాలా మందికి తెలియదు. ఒకరిద్దరు నిబంధనల గురించి ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పెట్రోలు బంకుల వద్ద వినియోగదారులకు సదుపాయాలు అందించకపోతే ఫిర్యాదు చేయవచ్చు.

### స్వచ్ఛమైన తాగునీరు

గుంటూరు జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 187 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. వీటి వద్ద స్వచ్ఛమైన తాగునీటి వసతి తప్పనిసరిగా కల్పించాలి. దీని కోసం బంక్ డీలర్ ఆర్వో యంత్రం, వాటర్ కనెక్షన్ కలిగి ఉండాలి. ఏ బంకులోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు.

### మూత్రశాలలు, మరుగుదొడ్లు

స్వచ్ఛ భారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా వినియోగదారులను నిర్వాహకులు అనుమతించడం లేదనే విమర్శలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల అసలు మరుగుదొడ్లు కనిపించని పరిస్థితి. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటరు పెట్రోలు లేదా డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంక్‌లకు నాలుగు నుంచి ఎనిమిది పైసల వరకు మరుగుదొడ్లు, మూత్ర శాలల నిర్వహణకు చెల్లిస్తున్నాం.

#### గాలి ఉచితంగానే

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తినీ నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి, ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్‌లెస్ టైర్లు వస్తున్నాయి. వాటిల్లో నైట్రోజన్ నింపాలి.

### ఆపదవేళ ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోలు బంకును సందర్శించడం ద్వారా మీరు ఏ నంబరుకైనా కాల్ చేసుకోవచ్చు.

#### ఫిర్యాదుల పెట్టె, ప్రథమ చికిత్స కిట్

ప్రతి బంక్‌లో ఫిర్యాదు పెట్టె, రిజిస్టరును అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్ వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఈ ప్రథమ చికిత్స పెట్టెలో ఆరోగ్యాన్ని రక్షించే మందులు ఉండాలి. దీంతోపాటు అన్ని మందులపై గడువు తేదీ రాసి ఉంచాలి. పాత మందులు ఉంచకూడదు.

### నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవచ్చు

పెట్రోలు, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంది. ఈ సదుపాయాన్ని బంకుల యాజమాన్యాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి. పెట్రోలు, డీజిల్ తక్కువగా వస్తుందని అనుమానం వస్తే వినియోగదారులు అక్కడికక్కడే పరీక్షించుకోవచ్చు. క్వాలిటీ చెక్ టిష్యూ పేపర్‌నూ యాజమాన్యం అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబరును ప్రదర్శించాలి.

#### సరైన అవగాహన లేదు



బంకుల్లో ఉన్న సౌకర్యాలను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. పెట్రోలియం మంత్రిత్వశాఖ అధికారులు దీనికోసం సదస్సులు నిర్వహించాలి. సేవలన్నింటికీ కలిపి చమురు ధరలో వినియోగదారులు చెల్లిస్తున్నా.. వాస్తవానికి అవి అందుబాటులో ఉండడం లేదు. దీనికి కారణం ప్రజలకు సరైన అవగాహన లేకపోవడమే.

– పి.జగదీష్, గుంటూరు

#### బంక్ నిర్వాహకులు నిబంధనలు పాటించాల్సిందే



జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 187 పెట్రోల్ బంకులు ఉన్నాయి. నిబంధనలకు అనుగుణంగా మరుగుదొడ్లు ఉండాలి. తాగునీటి సదుపాయం కల్పించాలి. వాహనాలకు ఉచితంగా గాలి పెట్టాలి. నిత్యం పౌర సరఫరాలు, రెవెన్యూ, పోలీసు అధికారులు బంకుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి ఫిర్యాదులు వస్తే సత్వరం స్పందిస్తాం.

– కోమలి పద్మ,
జిల్లా పౌరసరఫరాల అధికారి, గుంటూరు

## వేణుగోపాలునికి గంధంతో అలంకారం



లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక కొత్తపేట పశువుల ఆసుపత్రి ఎదురులోని జగన్నాథస్వామి దేవస్థానంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం జరిగాయి. స్వామికి గంధంతో అలంకారం చేశారు. భక్తులు పెద్దఎత్తునదర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం పది గంటలకు లక్ష్మీ గణపతి హోమం, రాత్రి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. జగన్నాథ, ఆంజనేయ, వేంకటేశ్వరస్వామి వార్ల దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ (ఈఓ) డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, శ్రీ అయోధ్య అయ్యప్ప సభ్యులు పాల్గొన్నారు.



గంధం అలంకారంలో వేణుగోపాలస్వామి

## ఎండీఎం కార్మికులకు వేతనం పెంచాలని వినతి

తాడేపల్లిరూరల్ : మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం)లో పనిచేస్తున్న మహిళా కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు కోరారు. సోమవారం ఉండవల్లిలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలసిన రమేష్ బాబు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 86,500 మంది మహిళలు మధ్యాహ్న భోజన పథకంలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వీరి వేతనాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. వంట గ్యాస్ ఉచితంగా అందజేయాలని, పాఠశాలల్లో పనిచేసే స్కావెంజర్స్‌కూ వేతనాలు పెంచాలని, మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని



విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేసిన రమేష్ బాబు

విన్నవించారు. 134 ఆదర్శ పాఠశాలల వసతి గృహాల్లో పనిచేస్తున్న దాదాపు 1,200 మంది ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని రమేష్‌బాబు తెలిపారు.

## వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వెంకన్న విగ్రహ ప్రతిమను ఆవిష్కరించి పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

- ఆకట్టుకున్న స్వామి అలంకారం
- తొలిపూజ చేసిన ప్రముఖ ఉపన్యాస వాచస్పతి మొవ్వ వృషాద్రిపతి

కోడూరు:కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఉదయం వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ కృష్ణాపురం గ్రామానికి చెందిన కోట మురళీధర్ – కౌసల్య దంపతులు అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకాన్ని కనులపండువగా నిర్వహించారు. 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేసి, కలశాలలోని జలాలతో మూలమూర్తులకు అభిషేకాలు చేశారు. రాత్రికి ఆలయ కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ప్రముఖ ఉపన్యాస వాచస్పతి మొవ్వ వృషాద్రిపతి




ప్రత్యేక అలంకారంలో మూలమూర్తులు

తొలిపూజలు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కల్యాణ వేదిక వద్ద స్వామి విగ్రహ ప్రతిమను ఆవిష్కరించి హారతులిచ్చారు. స్వామి, అమ్మవార్ల గుణగణాలను వివరిస్తూ వృషాద్రిపతి భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంతానం కోరే మహిళలకు గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఏర్పాట్లను ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ పర్యవేక్షించారు. ఉత్సవాలను పురస్కరించుకొని గర్భాలయంలోని మూలమూర్తులకు చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో టీటీడీ ప్రచార కమిటీ మాజీ సభ్యుడు మొవ్వ రఘుశేఖరప్రసాద్, కోట సంపత్‌కుమార్, ఆర్యవైశ్య, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# కాలేయం.. జాగ్రత్త..

**పెరుగుతున్న లివర్ సిర్రోసిస్ కేసులు**

- అశ్రద్ధ చేస్తే క్యాన్సర్‌కు దారి తీస్తున్న వైనం
- ఫ్యాటీ లివర్‌ను అశ్రద్ధ చేయరాదు
- రెగ్యులర్‌గా స్క్రీనింగ్ తప్పనిసరి అంటున్న వైద్యులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): మానవ శరీరం లోపలి అవయవాల్లో కాలేయం పెద్దది. ఇది నిరంతరం ఒకేసారి అనేక పనులు చేస్తుంది. కాలేయంపై జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా కాలేయాన్ని కాటేసే సిర్రోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు అంటున్నారు. ఇటీవల కాలేయ వ్యాధులతో బాధపడుతున్న వారు అధికంగా ఉంటున్నట్లు చెబుతున్నారు. అందుకు మధుమేహం, కొన్ని రకాల మందుల వాడకం, హెపటైటిస్, ఒబెసిటీ, ఆహార అలవాట్లు, ఆల్కహాల్ తాగడం కారణమని అంటున్నారు. ఫ్యాటీ లివర్‌ను అశ్రద్ధ చేస్తే సిర్రోసిస్‌కు దారితీస్తుందని, క్రమేణా క్యాన్సర్‌గా మారే అవకాశాలు ఉన్నట్లు హెచ్చరిస్తున్నారు. ఆహార అలవాట్ల కారణంగా ప్రతి వంద మందిలో 60 మందికి ఫ్యాటీ లివర్ ఉంటుండగా, 15 శాతం మందిలో గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఆల్కహాల్ తాగే వారితోపాటు, తాగని వారు కూడా లివర్ సిర్రోసిస్‌కు గురవడం ఆందోళన కలిగిస్తోంది.

### ఆస్పత్రులకు క్యూ

లివర్ సమస్యలతో బాధపడుతున్న వారు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుల వద్దకు వస్తున్న వారిలో అల్సర్లు, అరుగుదల ఇబ్బందులతోపాటు, లివర్ ప్రాబ్లమ్స్ ఉన్న వారు కూడా ఎక్కువగా ఉంటున్నారు. హెపటైటిస్ బీ, సీ కేసులు వస్తున్నాయి. ఇటీవల సిర్రోసిస్ కేసులు ఎక్కువగా చూస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఫ్యాటీ లివర్ కేసులు పదుల సంఖ్యలో ఉంటున్నాయని వారు అంటున్నారు. నాన్ ఆల్కహాలిస్టుల్లో ఫ్యాటీ లివర్ సిర్రోసిస్‌కు దారితీస్తే ప్రాణాంతకం కావచ్చు.

#### లివర్ వ్యాధులకు కారణాలివే

- శ్రమలేని జీవన విధానం
- ఆహార అలవాట్లు
- పెరుగుతున్న మధుమేహాలు
- ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తినడం
- ఆల్కాహాల్ సేవనం

### వీరు అప్రమత్తంగా ఉండాలి

లివర్ సమస్యలు, హెపటైటిస్ సీ ఎక్కువగా మధుమేహులు, హైపోథైరాయిడ్ ఉన్న వారు, రక్తంలో కొలస్ట్రాల్ స్థాయిలు అబ్‌నార్మల్ ఉన్న వారిలో వస్తున్నాయి.

ఫ్యాటీ లివర్ కామన్‌గా భావించి అశ్రద్ధ చేస్తుండటంతో అధికాస్త సిర్రోసిస్‌కు దారితీస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఫ్యాటీ లివర్ గ్రేడ్ 1, గ్రేడ్ 2, గ్రేడ్ 3లో దుష్ఫలితాలు లేకుండా చూడవచ్చునని, సిర్రోసిస్‌కు దారితీస్తే లివర్ గట్టిపడి వెనక్కి వచ్చే పరిస్థితి ఉండదని వైద్యులు అంటున్నారు. లివర్ ఫంక్షన్‌లో తేడా వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఆ పరిస్థితుల్లో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం ఒక్కటే మార్గమని వారు అంటున్నారు.

#### స్క్రీనింగ్ తప్పనిసరి



లివర్ వ్యాధులకు ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించవు. కొందరిలో సాధారణంగా జ్వరం, కామెర్లు, నీరసం, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయి. కాబట్టి మధుమేహులు, ఆల్కహాల్ సేవించే వారు, ఒబెసిటీ ఉన్న వారు, హెపటైటిస్ వైరస్‌లు ఉన్న వారు ముందుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. అల్ట్రా సౌండ్ స్కానింగ్‌తో పాటు, ఇప్పుడు ఖచ్చితంగా నిర్ధారించేందుకు ఫైబ్రోస్కాన్ అందుబాటులోకి వచ్చింది. లివర్ ఆరోగ్యంగా ఉండాలంటే ఆహార నియమాలు పాటించడం, రెగ్యులర్ వ్యాయామం తప్పనిసరి.

–డాక్టర్ సూరే పవన్‌కుమార్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్

#### ముందు జాగ్రత్త మేలు

శారీరక శ్రమలేని జీవన విధానానికి ప్రతి ఒక్కరూ అలవాటు పడ్డారు. దానికి తోడు కొవ్వు ఎక్కువగా ఉన్న జంక్‌ఫుడ్స్ తింటున్నారు. దీంతో శరీరంలో కొవ్వు స్థాయి విపరీతంగా పెరిగి, లివర్‌పై ప్రభావం చూపుతోంది. వయస్సు 40 ఏళ్ల దాటిన వారు ఏటా లివర్ ఫంక్షన్ టెస్ట్, కొలస్ట్రాల్ లెవల్స్, థైరాయిడ్, షుగర్ పరీక్షలతోపాటు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ కూడా చేయించుకుంటే మంచిది. ఇప్పుడు లివర్ పనితీరును కచ్చితంగా నిర్ధారించడానికి ఫైబ్రో స్కాన్ అందుబాటులోకి వచ్చింది. ఆయా పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించుకుని ముందు జాగ్రత్తలు తీసుకుంటే మేలని వైద్యులు సూచిస్తున్నారు.

## క్లుప్తంగా

### గుంటూరు పశ్చిమలో 8 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.8 మి.మీ. వర్షం పడింది. మండలాల వారీగా.. పెదనందిపాడు 7.8 మి.మీ., తెనాలి 7.8, పెదకాకాని 7.2, గుంటూరు తూర్పు 6.2, ఫిరంగిపురం 5.8, కాకుమాను 5, తుళ్లూరు 3.6, కొల్లిపర 2.4, మంగళగిరి 2, దుగ్గిరాల 1.8, తాడేపల్లి 1.8, తాడికొండ 1.8, చేబ్రోలు 1.4, మేడికొండూరు మండలంలో 1 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూన్ 17వ తేదీ నాటికి సాధారణ వర్షపాతం 55 మి.మీ. కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 70.2 మి.మీ. నమోదైంది.

### అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


వెంకటసాయి మృతదేహం

గుంటూరు రూరల్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్‌కుమార్ కథనం ప్రకారం బ్రాడీపేటకు చెందిన తోట వెంకటసాయి (26) మిర్చి యార్డ్ సమీపంలోని చిల్లీస్‌మెన్షన్ హౌస్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య సామ్రాజ్యం ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆర్థిక సమస్యలు ఎక్కువై మనస్తాపానికి గురైన వెంకటసాయి సోమవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని తండ్రి రాము ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లారీ ఢీకొని స్పిన్నింగ్ మిల్లు కార్మికుడి మృతి


రాఘుబ్‌జన మృతదేహం

నాదెండ్ల: జాతీయ రహదారి దాటుతున్న కార్మికుడిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ఒడిసా రాష్ట్రానికి చెందిన రాఘుబ్‌జన (54) ఏడాది నుంచి ప్రసన్నవంశీ స్పిన్నింగ్ మిల్లు క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ పనికి వెళ్తుంటాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. వీరు ఒడిసా రాష్ట్రంలో నివసిస్తుంటారు. రాత్రి 8.30 గంటల సమయంలో కంపెనీ నుంచి వ్యక్తిగత పనులపై బయటకు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో రాఘుబ్‌జన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు సంతోషజన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బొప్పాయిలో సస్యరక్షణతో అధిక దిగుబడులు

**కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి**



ఘంటసాల: బొప్పాయిలో సస్య రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు శాస్త్రవేత్తలు, అధికారులు సూచించిన సలహాలు పాటించడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చునని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ పంటలను సంరక్షించుకుంటూ, సకాలంలో సస్యరక్షణ చేపడితే బొప్పాయిలో లాభాలు పొందవచ్చన్నారు.


బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్త మంజువాణి

### సస్య రక్షణ చర్యలు

**కాండం కుళ్లు:** కాండం మొదలు కుళ్లిపోయి మొక్కలు వాలిపోతాయి. జిగురు లాంటి ద్రవం మొక్క మొదలు నుంచి కారుతుంది. దీని నివారణకు రెండు కిలోల ట్రైకోడర్మా విరిడి శిలీంధ్రానికి 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి కలిపి చెట్ల పాదుల్లో వేయాలి. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే రిడోమిల్ ఎమ్‌-జడ్ 2గ్రా. లీటరు నీటికి కలిపి చెట్ల మొదల్లో, కాండాన్ని తడుపుతూ పోయాలి.

**పండు ఈగ:** పండు పక్వానికి వచ్చిన తర్వాత కాయలను పండు ఈగ ఆశించి నష్టాన్ని కలుగజేస్తుంది. తల్లి ఈగ గోధుమ రంగులో పారదర్శక రెక్కలు కలిగివుండి సూదిలాంటి మొనను కాయల చర్మం కిందికి చొప్పించి గుడ్లను గుంపులుగా పెడుతుంది. ఈ గుడ్లు 3–4 రోజుల్లో పొదిగి చిన్న లార్వాలుగా వృద్ధి చెంది కాయలలోని గుజ్జును తినివేస్తాయి. దీని వల్ల ఆశించిన భాగంలో మెత్తబడి కుళ్లిపోతాయి.

**నివారణ:** తోటలను శుభ్రంగా ఉంచుకోవాలి. చెట్ల కింద పడిన, చెట్ల పైన మిగిలి పోయిన పండ్లను ఏరి నాశనం చేయాలి. మిథైల్ యూజినాల్ ఎరలను ఉపయోగించి ఆకర్షించబడిన మగ పురుగులను నాశనం చేయాలి.

1మి.లీ.ల మిథైల్ యూజినాల్, 2గ్రా.ల కార్బోఫ్యూరాన్ ఒక లీటరు నీటికి కలిపి పొలంలో అక్కడక్కడా ఉంచాలి.

### బొప్పాయిలో వైరస్ తెగుళ్లు

**రింగ్ స్పాట్ వైరస్:** ఈ వైరస్ ఆశించిన మొక్కల ఆకులు పరిమాణం తగ్గి సన్నటి తీగలాగ మారుతాయి. కాయలు, కాండం మీద ఉంగరం లాంటి మచ్చలు ఏర్పడతాయి. ఈ వైరస్ సోకిన మొక్కల నుంచి వచ్చిన కాయల నిల్వ సామర్థ్యం తగ్గుతుంది.


కాయపై రింగ్ స్పాట్ వైరస్

**ఆకుముడత:** ఈ వైరస్ ఆశించిన మొక్కల్లో ఆకులు ముడుచుకుపోతాయి. తెగులు తీవ్రమైనప్పుడు ఉండలుగా మారి వికృత రూపం దాల్చుతాయి. కాయలు సహజ ఆకారం కోల్పోయి వంకరటింకరగా తయారవుతాయి. దిగుబడి గణనీయంగా తగ్గుతుంది.

**నివారణ:** బొప్పాయి వైరస్‌లో ముఖ్యమైనవి ఆకుముడత, రింగ్ స్పాట్ .

- జిగురు పూసిన పసుపు అట్టలను ఎకరానికి 12–15 చొప్పున మొక్కల ఎత్తుకన్నా కొద్దిగా ఎత్తులో అమర్చుకోవాలి.
- వేప నూనె 2.5 మి.లీ. + అసిఫేట్ 2.5 గ్రా + జిగురు 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.
- వైరస్ సోకిన మొక్కల దిగుబడి , నాణ్యతను పెంచడానికి 10 గ్రా. యూరియా + జింక్ సల్ఫేట్ 1.5 గ్రా + బోరాన్ 1గ్రా లీటరు నీటికి కలిపి 30 రోజుల వ్యవధిలో ఎనిమిది నెలల వరకు పిచికారీ చేయాలి.


ఆకుముడత వైరస్ సోకిన ఆకులు

# డిగ్రీ ప్రవేశాల్లో ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): డిగ్రీ ప్రవేశాల్లో ఆన్‌లైన్ విధానాన్ని తొలగించి పూర్వ పద్ధతి అమలు చేయాలని ఏసీటీఏ ఏపీ కార్యవర్గం డిమాండ్ చేసింది. స్థానిక జేకేసీ కళాశాలలో సోమవారం ఏసీటీఏ ఏపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తొలుత కొత్త ప్రభుత్వం, సీఎం నారా చంద్రబాబునాయుడికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ ఉద్యమనేత మాజీ ఎమ్మెల్సీ ఎం.జె.మాణిక్యరావు చిత్రపటానికి నివాళులర్పించారు. గత విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టిన డిగ్రీలో మేజర్, మైనర్ పద్ధతులను రద్దు చేసి, పాత పద్ధతిలోనే మూడు ఆప్షన్లు పునరుద్ధరించాలని నాయకులు కోరారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని విన్నవించారు. అనంతరం మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణకు వినతిపత్రం అందించారు. సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కె.సాంబిరెడ్డి, అధ్యక్షుడు కె.మోహనరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాససాయి, ఆర్థిక కార్యదర్శి డాక్టర్ కె.మోజెస్, ముద్రణ కార్యదర్శి డాక్టర్ సదాశివరెడ్డి, ఎం రమేష్, జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, పీఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి శ్రీనివాస్, డాక్టర్ కేఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల (దుగ్గిరాల) ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి, బోడెపూడి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ కళాశాల అసోసియేషన్ ప్రతినిధులు (జీసీటీఏ/జీసీజీటీఏ) నాయకులు డాక్టర్ రాజగోపాల్ బాబు, డాక్టర్ శ్యాంబాబు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రాఘవరెడ్డి, డాక్టర్ ఘంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

### పరస్పర దాడిలో ఆరుగురికి గాయాలు

చినగంజాం (పర్చూరు): పాత కక్షల నేపథ్యంలో ఇరు వర్గాలు దాడి చేసుకున్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పర్చూరు మండలంలోని నూతలపాడులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ముల్లా సుభాని, షేక్ కాలేషావలీకి మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు ఘర్షణకు దిగారు. ఇందులో ముల్లా సుభానికి తీవ్రగాయాలు కాగా, అతని తండ్రి ముల్లా పెదబాజీవలి, వల్లభరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ముల్లా బాజీవలి, షేక్‌కాలేషావలి, నూర్‌బాషా మస్తాన్‌వలీకి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స కోసం చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. అక్కడ ఔట్‌పోస్టు పోలీసుల ఫిర్యాదు మేరకు పర్చూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ముల్లా సుభాని ఫిర్యాదు మేరకు ముల్లా బాజీవలి, షేక్ కాలేషావలి, ముల్లా సుభాని, షేక్ బాజీవలి, ముల్లా మస్తాన్‌వలి, షేక్ మునీర్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం షేక్ కాలేషావలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముల్లా సుభాని, ముల్లా పెదబాజీవలి, వల్లభరెడ్డి రాజశేఖర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

# 21న చాగంటి 'ప్రవచనామృతం'

తెనాలి: బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనామృతం ఈ నెల 21వ తేదీ తెనాలిలో జరగనుంది. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తనా బృందం, సంకీర్తనా సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమ ఆహ్వానపత్రాన్ని సోమవారం శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆవిష్కరించి వివరాలను తెలిపారు. స్థానిక సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో 21న సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ఆరంభమవుతుందని తెలిపారు. ముందుగా పంచముఖ ఆంజనేయస్వామికి విశేష అర్చనలు, అనంతరం శ్రీహనుమాన్ చాలీసా పారాయణం, అనంతరం 6.45 గంటలకు ప్రవచనం ప్రారంభిస్తారని వెల్లడించారు. ఆహ్వానపత్రిక ఆవిష్కరణలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్.బి.శివ, వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, సేవాసమితి గౌరవ సలహాదారులు వుప్పల వరదరాజులు, అధ్యక్షుడు ఆర్.వి. కిరణ్ కుమార్, కార్యదర్శి మూర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

# సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్ : ఉమ్మడి గుంటూరు జిల్లా సహకార సంఘాల యూనియన్ నాయకులు సోమవారం పెదవడ్లపూడిలో మహాజన సభను నిర్వహించారు. కార్యక్రమానికి యూనియన్ గౌరవ అధ్యక్షులు రోశయ్య అధ్యక్షత వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు జి.వెంకటరెడ్డి మాట్లాడుతూ యూనియన్‌లో సభ్యులంతా ఐక్యంగా ఉండాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సహకార సంఘాల ఉద్యోగులకు రావాల్సిన రెండు పీఆర్సీలను అమలు చేయాలని, పాత బకాయిలు మంజూరు చేయాలని కోరారు. వీటితో పాటు ఇతర సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ముప్పా వెంకటేశ్వరరావు, యూనియన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు రాయల్ రమేష్, పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె. నారాయణ, ఎ. శ్రీనివాసరావు, యూనియన్ తెనాలి డివిజన్ అధ్యక్షులు ఎస్‌కే బాషా, నాయకులు సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహాజనసభలో పాల్గొన్న ఉమ్మడి గుంటూరు జిల్లా యూనియన్ నాయకులు

# వృద్ధులను వేధించే వారిని శిక్షించాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): వృద్ధులను వేధించే వారిని అరెస్ట్ చేసి శిక్షించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాగంరెడ్డి పరమేశ్వరరెడ్డి కోరారు. గుంటూరు శంకర్ విలాస్ రైల్వే ఓవర్‌బ్రిడ్జి రైల్వే బ్యారెక్స్ వద్ద ఉన్న సంఘ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు బైసాన్ని కైలాస్‌నాథ్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల అనంతపురంలో మామపై కోడలు దాడికి పాల్పడి, హింసించిన ఘటనను ఖండించారు. ఈ తరహా ఘటనలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య సలహాదారు వల్లూరి సదాశివరావు, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు ఏ.ఎం.జి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వృద్ధుల వేధింపుల చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరుతూ త్వరలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించనున్నట్లు చెప్పారు. అనంతరం సభ్యులు కార్యాలయం నుంచి ప్రదర్శనగా వెళ్లి లాడ్జి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో ఆర్టీసీ విశ్రాంత నాయకులు వరప్రసాద్, నాగేందర్‌రెడ్డి, రాంబాబు, కె. కామేశ్వరరావు, మురళీకృష్ణమూర్తి, సుబ్బారావు, చావా రమేష్ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

# ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి.హైమారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల కిందట మంగళగిరి ఎన్జీఓ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ మేరకు జేకేసీ కళాశాల రోడ్డులోని కార్యాలయంలో ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. 20 ఏళ్లగా ఉపాధ్యాయుల సంక్షేమానికి హైమారావు కృషి చేశారని ఎ.ఎస్.రామకృష్ణ చెప్పారు. ఆయన నియామకం అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ ఖలీల్, ఎస్.వి.జగదీష్, ఆర్థిక కార్యదర్శి జి.ఆంతోని, నగర శాఖ నాయకులు పి.లలితబాబు, పి.సాయి విశ్వనాథ్, ఎ.హరగోపాల్ పాల్గొన్నారు.


హైమారావును అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ

# మిర్చిలోడు లారీ దగ్ధం

రాజుపాలెం: మిర్చి లోడుతో వెళుతున్న లారీలో ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో లోడు సహా లారీ దగ్ధమైంది. ఈ సంఘటన పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని అనుపాలెం సమీపంలో పెద్దకాలువ వద్ద మాచర్ల–గుంటూరు రహదారిపై సోమవారం జరిగింది. నెల్లూరు జిల్లా జలదంకి మండలానికి చెందిన లారీ గుంటూరులోని అరవిందా ట్రేడర్స్‌లో 10టన్నుల(300 బస్తాలు) మిర్చి బస్తాలను లోడు చేసుకుని మహారాష్ట్రలోని నందూర్‌బార్ జిల్లాకు బయలుదేరింది. మార్గంమధ్యలో అనుపాలెం వద్ద ఇంజిన్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన లారీ డ్రైవర్ మహేష్, క్లీనర్ కిందకు దూకారు. లారీలో గ్యాస్ సిలెండర్‌కు మంట అంటుకొని పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. లారీ, మిర్చి బస్తాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సత్తెనపల్లి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఏఎస్ఐ పుల్లారావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సుమారు రూ.20లక్షల నష్టం వాటిల్లినట్లు డ్రైవర్ తెలిపాడు.


మంటల్లో కాలిపోతున్న లారీ

# బాధితుడిని కాపాడిన వ్యక్తిపై దాడి

**సెల్‌ఫోన్, బైక్ తాళం అపహరణ**

పెదకాకాని: దెబ్బలు తగిలిన వ్యక్తిని బైక్‌పై ఎక్కించుకుని వెళుతున్న ఓ వ్యక్తిపై దాడి చేసి బైక్ తాళం, సెల్‌ఫోన్ లాక్కున్న సంఘటన ఆటోనగర్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు ఏటీ అగ్రహారంలో నివసిస్తున్న జి.లీలాకృష్ణ రిపోర్టర్(సాక్షి కాదు)గా పనిచేస్తున్నాడు. పెదకాకానిలో స్నేహితుడిని కలిసేందుకు గుంటూరు నుంచి స్కూటీపై బయలుదేరాడు. మార్గంమధ్యలో జాతీయ రహదారి పక్కనే సర్వీసు రోడ్డులో వస్తున్న సమయంలో ఓ వ్యక్తి దెబ్బలు తగిలి పడిఉండటం చూసి తన స్కూటీపై ఎక్కించుకున్నాడు. స్కూటీపై ఎక్కిన వ్యక్తి తాను అడ్వకేట్‌గా పనిచేస్తున్నానని, జంతు వధకు వ్యతిరేకంగా పనిచేస్తుంటానని తెలియజేశాడు. కొద్ది సేపటికే వెనుక నుంచి వచ్చిన సుమారు పది మంది వ్యక్తులు ఆటోనగర్ ఇండియన్ ఆయిల్ బంక్ వద్దకు చేరుకునేసరికి ఇరువురిని వెంబడించి కొట్టి గాయపరచారు. ప్రాణభయంతో పరుగులు తీసిన విలేకరి వద్ద నుంచి సెల్‌ఫోన్, స్కూటీ తాళాలు లాక్కుని వెళ్లిపోయారు. దీంతో బాధితుడు లీలాకృష్ణ పెదకాకాని పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.


పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న లీలాకృష్ణ

# వెంపటి పెదసత్యం చిరస్మరణీయులు


యల్లాజోశ్యుల అనూరాధ శిష్య బృందం ప్రదర్శన

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి నాట్య వైభవాన్ని దేశ నలుమూలలా వ్యాపింప చేయటమే కాకుండా, అకుంఠిత దీక్షతో కూచిపూడి నాట్యానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన వెంపటి పెదసత్యం చిరస్మరణీయులని ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహీత, కూచిపూడి నాట్య కళాపీఠం వైస్ ప్రిన్స్‌పాల్ చింతా రవి బాలకృష్ణ తెలిపారు. కూచిపూడి నాట్య లెజెండ్, సినీ నృత్య దర్శకులు వెంపటి పెదసత్యం 41వ వర్ధంతిని ఆయన జన్మస్థలమైన నాట్య క్షేత్రం కూచిపూడిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సిద్ధేంద్రయోగి నాట్య కళావేదిక పె వరంగల్‌కు చెందిన కళాకారిణి కాత్రగడ్డ హిమాన్సీ చౌదరి, విజయవాడకు చెందిన యల్లాజోశ్యుల అనూరాధా శిష్య బృందం, విజయవాడకు చెందిన మలిశెట్టి అనూష నాయుడు, చింతాడ చార్విరాజు, డాక్టర్ చింతా రవి బాలకృష్ణ శిష్య బృందం ప్రదర్శించిన నాట్యాంశాలు ఆకట్టుకున్నాయి. ముందుగా ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహీతలు వేదాంతం వెంకట నాగ చలపతి రావు, చింతా రవి బాలకృష్ణలతో పాటు వెంపటి సత్య ప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు.

# అదుపుతప్పి బోల్తా కొట్టిన లారీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్లైవుడ్ షీట్లతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాకొట్టిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మద్రాసు నుంచి ఒక లారీ 30 టన్నుల బరువు కలిగిన ప్లైవుడ్ షీట్లను లోడ్ చేసుకుని కృష్ణలంకలోని ప్రేమ్‌సాయి ప్లైవుడ్ గోడౌన్‌కు ఆదివారం సాయంత్రం బయలుదేరింది. సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు కృష్ణలంక, ఫీడర్ రోడ్డులోని ఎం హోటల్ సమీపానికి చేరుకుంది. డ్రైవర్ లారీని రోడ్డు పక్కన ఆపి గోడౌన్ అడ్రస్ తెలుసుకునేందుకు క్లీనర్‌తో పాటు కిందకు దిగాడు. రోడ్డు పల్లంగా ఉండడంతో లారీలోని ప్లైవుడ్ షీట్లు పక్కకు జరిగాయి. దీంతో ఒక్కసారిగా లారీ ఒరిగిపోయి బోల్తా కొట్టింది. ఆ సమయంలో రోడ్డు మీద ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకపోవడంతో స్థానిక ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. గోడౌన్ యజమాని ప్లైవుడ్ షీట్లను తీసుకెళ్లేందుకు అశ్రద్ధ చేయడంతో సాయంత్రం వరకు ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. నెమ్మదిగా సాయంత్రానికి ప్లైవుడ్ షీట్లను ఆటోల ద్వారా గోడౌన్‌కు తరలించారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో జరగకుండా అనుమతి లేని పెద్ద పెద్ద లారీలను కృష్ణలంకలోకి ప్రవేశించకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.